

తెలంగాణ బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సినీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టి

తెలంగాణ బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో తెలంగాణ బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్-2025 శుక్రవారం ప్రారంభమైంది. భాష, సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలను ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, హైదరాబాద్ బెంగాలీ సమితికి చెందిన బప్పా ముజేంద్రర్‌తో కలిసి ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా సినీ పరిశ్రమకు విశిష్ట సేవలందించిన శ్యాం బెనగల్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, రాష్ట్రాల వారీగా, భాషల వారీగా ఆయా సంప్రదాయాలు, సంస్కృతి అద్దం పట్టేలా ప్రాంతీయ భాషలో సినిమాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భారత దేశంలో ప్రాంతాల వారీగా అనేక సంప్రదాయాలు ఉంటాయని వాటిని భావితరాలకు తెలిసేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో దోహద పడతాయన్నారు. ఇంద్రనీల్ చౌదరి ఆధ్వర్యంలో ఉత్తమ్ కుమార్‌కు చెందిన సినీ పుస్తకాలు, బుక్‌లెట్స్, మేగజైన్ కవర్స్, పుస్తకాలను ఇక్కడ ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టి, డాక్టర్ హరికృష్ణ మామిడి, హైదరాబాద్ బెంగాలీ సమితి అధ్యక్షుడు మౌషుమి చౌదరి, జాయ్ కుమార్ దత్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరజ్ కా సత్వాన్ ఘోడా చిత్రాన్ని ప్రదర్శించారు.



పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి కుష్బూ గుప్తా అన్నారు. నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ జిల్లా శాఖ, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ సహకారంతో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ జరిగింది. వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీ ఉమెన్స్ విభాగంలో మొదటి బహుమతిని సిటీ కాలేజ్, రెండో బహుమతిని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, వాలీబాల్ పురుషుల విభాగంలో మొదటి, రెండో బహుమతులను ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.యశస్విని, రెండో బహుమతి సిటీ కళాశాలకు చెందిన బి.శృతి, మూడో బహుమతి ప్రీతి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఖైరతాబాద్, 200 మీటర్స్ రన్నింగ్ (మెన్స్) మొదటి, రెండో బహుమతులను డి.ప్రవీణ్, బి.సతీష్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఖైరతాబాద్, మూడో బహుమతి సిటీ కళాశాల విద్యార్థి సాయికుమార్ గెలుచుకున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కదిరి మల్లేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ ఉపాధికి ఇబ్బంది రాకుండా చూస్తా..

- నోటరీ, టైపిస్ట్, స్టాంప్ వెండర్లకు ఎమ్మెల్యే తలసాని హామీ

మారేడుపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మీ ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాను అండగా ఉంటానని నోటరీ, స్టాంప్ వెండర్లకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ కోర్టు పరిసరాల్లో నోటరీ, టైపిస్ట్, స్టాంప్ వెండర్లుగా జీవనం సాగిస్తున్న వారు శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలో కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఎన్నో సంవత్సరాలుగా కోర్టు పరిసరాల్లోని ఫుట్‌పాత్‌లపై తాము ఇదే వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే, మూడు రోజుల్లో ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు తమకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేస్తే తాము ఉపాధి కోల్పోయి తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని 'మీ ఉపాధికి ఇబ్బంది కలగకుండా చూస్తా, మీకు అండగా ఉంటా' అని వారికి భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్‌గా దేశ్‌కాంత్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ పార్టీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్‌గా దేశ్ కాంత్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన విచార్ విభాగ్ చైర్మన్ గిరిజా వ్యాస్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు దేశ్ కాంత్ పుదుచ్చేరి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు. దేశ్ కాంత్ తెలంగాణ ఉద్యమం సమయంలో చురుకుగా పని చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ విజయానికి కృషి చేశారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం విచార్ విభాగ్ జాతీయ కో ఆర్డినేటర్‌గా నియమించింది.



గిరిజా వ్యాస్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న దేశ్‌కాంత్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న విద్యాశాఖ అధికారి రోహిణి

బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన అండర్ 14 బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో యూసుఫ్‌గూడ ఎంజీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఐదు రౌండ్లు గా జరిగిన పోటీల్లో విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణి ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎంఎం నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్‌నాయుడు, కోచ్ ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

గతేడాది నమోదైన కేసుల వివరాలు

అనధికార వ్యక్తులు వాహనాలు నడపడం	8768
ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు నిలిపినందుకు	6169
సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ...	10,295
ప్రమాదకరంగా డ్రైవింగ్	1242
మద్యం తాగి..	9608
అతి ప్రమాదకర ప్రయాణం	4618
ఫ్యాన్సీ నంబర్ మార్చి రాయడం	15038
మైనర్లు వాహనం నడపడం	389
నంబర్ ప్లేటు సరిగా లేకపోవడం	12533
హెల్మెట్‌కు సంబంధించి	1,081
సర్వీస్ రోడ్లపై పార్కింగ్	1,09,375
సిగ్నల్ జంపింగ్	14470
జీబ్రా లైన్ క్రాసింగ్	60,622
అపసవ్య దిశలో డ్రైవింగ్	53,834
డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం	9,693
నంబర్ ప్లేటు లేని వాహనదారులు	641
సీటు బెల్టు ధరించకపోవడం	1577
ట్యాక్సీ డ్రైవర్ వేధింపులు/అసభ్య ప్రవర్తన	37

వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)



మేం మారం!

అడుగడుగునా ట్రాఫిక్ ఉల్లంఘనలు

- కేసులు నమోదు చేసినా మారని వాహనచోదకుల తీరు
- కౌన్సెలింగ్‌తో మార్పు తేవాలని భావిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరం రోడ్లపై ట్రాఫిక్ పెరిగిపోతోంది.. ఏ చౌరస్తా చూసినా వాహనాలతో కిక్కిరిసిపోతోంది.. అయితే కొంత మంది వాహన చోదకులు చేస్తున్న తప్పుల వల్ల తోటి వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇలాంటి వారిపై పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నా వారిలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

విశాలమైన రోడ్లు ఉన్నా...

ముఖ్యంగా పశ్చిమ మండలం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, సంజీవరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు ఉన్నప్పటికీ ఆఫీసు సమయాల్లో ట్రాఫిక్ జామ్ తప్పడం లేదు. రోడ్లపై వాహనాల రద్దీ కారణంగా కొన్నిచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతుండగా, మరికొన్ని సమస్యలు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల వస్తున్నాయని నమోదవుతున్న కేసుల సంఖ్యను బట్టి తెలుస్తోంది.

ట్రాఫిక్ లేని సమయంలో కూడా...

సంక్రాంతి సమయంలో నగరంలో ట్రాఫిక్ చాలా తక్కువగా ఉంటుంది. అయితే, ఆ సమయంలో కూడా వాహన చోదకులు అతివేగం తోటి ప్రయాణికుల ప్రాణాల మీదకు తెస్తోంది. గత నెల ఓ వ్యక్తి పండగ స్వీట్లు కొనుగోలు చేసేందుకు సంజీవరెడ్డినగర్‌కు వెళ్లగా వెనుకాల నుంచి ట్రిబుల్ రైడింగ్‌లో అతి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఇలాంటి ఘటనలు ట్రాఫిక్ పోలీసులను సైతం కలవరపెడుతున్నాయి.

పదే పదే ఉల్లంఘనలు...

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో వారంలో పలుమార్లు ట్రాఫిక్ ఉల్లంఘటనలకు పాల్పడుతున్న వాహనాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పోలీసులు గుర్తించారు. యజమానులను ప్రశ్నించగా కేసులు పెట్టుకోండి మేము మారం అన్నట్టు సమాధానాలు ఇవ్వడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చౌరస్తాలో అతి వేగంగా వెళ్తూ పట్టుబడ్డ వారే పదే పదే పోలీసులకు చిక్కినవైనాలున్నాయి. ఇలాంటి వారిలో మార్పు తీసుకురాకపోతే తోటి ప్రయాణికులకుప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

పదే పదే ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తేచ్చే బాధ్యతను కూడా పోలీసులే తీసుకుంటున్నారు. ద్విచక్ర వాహనదారులు, కార్ల యజమానులు, ఆటో డ్రైవర్లకు వేర్వేరుగా పలుమార్లు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు.

రద్దీ సమయాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



పశ్చిమ మండలంలో ప్రధానమైన ప్రాంతాలు చాలా ఉన్నాయి. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ విపరీతంగా ఉంటోంది. అందువల్ల ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే సూచనల మేరకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. దాదాపు 30 మంది హైడ్రో సిబ్బంది, 8 మంది ట్రాన్స్ జెండర్ల సేవలను వినియోగించుకుంటున్నాం. ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న విద్యుత్తు స్తంభాల తొలగింపు, రహదారులకు మరమ్మతులు వంటి అంశాలపై దృష్టి సారించాం.

- కట్టా హరిప్రసాద్ పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ

2024లో 9,07,873 కేసులు నమోదు

పశ్చిమ మండలం పరిధిలో గతేడాది ట్రాఫిక్ ఉల్లంఘనులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. 2023లో 817,210 కేసులు నమోదు కాగా, 2024లో 9,07,873 నమోదయ్యాయి. డ్రంకెన్‌డ్రైవ్ కేసుల సంఖ్య 2023లో 7621 కాగా, గతేడాది 9608 నమోదయ్యాయి. పట్టుబడిన వాహనాల్లో 75 శాతానికి పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి 339 కేసులు నమోదు చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపి చిక్కినవారు 9,693 మంది ఉన్నారు. ఈ యేడాది కేవలం జనవరిలోనే సుమారు 80 వేల కేసులు నమోదయ్యాయని గుణాంకాలు చెబుతున్నాయి. గతంతో పోలిస్తే 20 శాతం ట్రాఫిక్ ఉల్లంఘనలు పెరిగాయి.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగపర్చుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. షేక్‌పేట డివిజన్‌కు చెందిన 99 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడపిల్లల వివాహం వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడొద్దు అనే ఉద్దేశ్యంతో షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను అమల్లోకి తెచ్చారన్నారు. ఈ పథకం పేద వారికి వరంగా మారిందన్నారు. కొత్తగా పథకాలు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు బీఆర్ఎస్ కార్యకర్తలు, కార్యాలయం నుంచి తగిన సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్, ఎల్లేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ డివిజన్‌లో..

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు షాదీముబారక్ పథకం కింద మొత్తం రూ. 6,00,696 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, వంశీతేజ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, నాయకులు షేక్ షరీఫ్ ఖురేషి, జావిద్, శ్రీకాంత్ దాసి, బాలకృష్ణ, ప్రవీణ, యాదమ్మ, కల్యాణి, సైదమ్మ, సుజాత పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

'శింగనమల' చెప్పినవన్నీ అబద్ధాలే

- ఫైనాన్షియర్ వైజయంతి భర్త సదానంద్

పంజాగుట్ట, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కొమరం పులి, ఖలేజా సినిమాలను తమ పెట్టుబడితో తీసి, తమకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఆ చిత్రాల నిర్మాత శింగనమల రమేష్ బాబు మోసం చేశాడని ఆ చిత్రాల ఫైనాన్షియర్ వైజయంతి రెడ్డి భర్త సదానంద్ ఆరోపించారు. తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో తాను మీడియా ముందుకు రావాల్సి వచ్చిందని శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తెలిపారు. కొమరం పులి, ఖలేజా సినిమాలకు తాము పెట్టుబడి పెట్టామని, అయితే, ఆ సినిమాలు తీసి తాను నష్టపోయానని శింగనమల రమేష్ బాబు చెప్పడంలో వాస్తవం లేదన్నారు. శింగనమల రమేష్‌బాబు విధానాల వల్లే షూటింగ్‌లు ఆలస్యమయ్యాయి కానీ.. సినీ నటులు, దర్శకుల వల్ల కాదన్నారు. వారి వల్ల నష్టపోయినట్టు అతను ఆరోపించడంలో నిజం లేదన్నారు. 2008లో సుమారు 20 కోట్ల రూపాయలను ఆ సినిమాలలో పెట్టుబడి పెట్టామని, ఆ డబ్బులు తిరిగి రాక 14 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తనతో పాటు మరికొందరు బాధితులు ఉన్నారని, వారిని కలుపుకొని పోరాటం చేస్తామన్నారు. త్వరలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కలుస్తామన్నారు. శింగనమల రమేష్ బాబును ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని సదానంద్ డిమాండ్ చేశారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి'

పంజాగుట్ట, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో ఆలస్యం చేస్తుండటంతో చదువు పూర్తయిన విద్యార్థులకు విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్ఐఓ), అసోసియేషన్ ఫర్ సోషియో ఎకనామిక్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది మార్జినలైజ్డ్ సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్ ఉల్ హక్, అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే మసూద్ మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు తాజుద్దీన్, ఫైసల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా

- కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. వీరిలో ఒకరు స్నేహితుడితో కలిసి తన సోదరుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన లాలమ్మ కుటుంబానికి లక్ష్మీనర్సింహనగర్‌లో ఓ ఇల్లు ఉంది. ఆమె కుమారులు శ్రీనివాస్, యాదగిరి మధ్య ఆస్తి వివాదం ఉంది. ఇదిలా ఉండగా ఈ నెల 8న లాలమ్మ, కుమారులు, కోడళ్లతో కలిసి కూర్చొని ఉండగా, ఆస్తి విషయంలో వారి మధ్య గొడవ జరిగింది. యాదగిరి అతడి స్నేహితుడు మహేష్‌తో కలిసి తన సోదరుడు శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు యాదగిరి, మహేష్‌లపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన మహిళపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించిన మహిళపై క్రిమినల్ కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. పద్మాలయ అంబేద్కర్‌నగర్ సర్వే నెంబరు 403లో ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు 180 గజాల భూమిలో డొక్కా ఉమారాణి రేకుల కట్టడాలు నిర్మించింది. షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు ఆ రేకుల కట్టడాన్ని కూల్చివేసి, అక్కడ ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు. కానీ ఉమారాణి మరోసారి ఆ స్థలాన్ని ఆక్రమించింది. ఈ నేపథ్యంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, డొక్కా ఉమారాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నార

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ శిల్పా వ్యాలీ, గోరా టవర్స్, ఎమ్‌సీ గ్రౌండ్, వైష్ణవి రెసిడెన్సీ, కుమ్మరి బస్తీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

మాటలకందని భావాలు..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేయి మాటలు చెప్పలేని భావాన్ని ఓ చిత్రం చెబుతుందంటారు. ఆ భావోద్వేగాలను ఒడిసిపట్టాలంటే ఓపిక మాత్రమే కాదు కాస్త సృజన, ఇంకాస్త అవగాహన కూడా కావాల్సి ఉంటుంది. అవి ఉన్నాయి కాబట్టే ఎమోషనల్ ఫసెడ్స్ అంటూ ఆయన బంధించిన ఓ చిత్రం జాతీయ స్థాయిలో రెండు అవార్డులు గెలుచుకుంది. అవేనా, ఇలాంటి విభిన్నమైన, వినూత్నమైన భావోద్వేగాలను పలికించే చిత్రాలతో 'గ్యాలరీయా 2025' పేరిట మాదాపూర్‌లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో నిర్వహిస్తున్న ఓ ప్రదర్శనలో తమ చిత్రాలను సైతం ప్రదర్శిస్తున్నారు ప్లేమ్యాక్స్ ఇంటరాక్టివ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, మారథానర్, ఫొటోగ్రాఫర్ కృష్ణ కలగర. ఈ ప్రదర్శనను శుక్రవారం సాయంత్రం తెలంగాణా వేర్‌హౌస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మి ప్రారంభించారు. ఈ నెల 11 వరకూ జరగనున్న ఈ ప్రదర్శన గురించి కృష్ణ కలగర మాట్లాడుతూ.. "ఫొటోగ్రఫీతో మానవ అనుభవాలను వెల్లడించే క్షణాలను ఒడిసిపట్టవచ్చు. ప్రతి ఫొటోగ్రాఫ్ ఓ కథను చెప్పగలదు. విభిన్న భావోద్వేగాలను పలికించగలదు, గుర్తింపునూ తీసుకురాగలదు" అన్నారు. ఈ ప్రదర్శన ద్వారా తన చిత్రాలతో పాటుగా ఔత్సాహిక యువత చిత్రాలను కూడా ప్రదర్శిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణా ఫొటోగ్రాఫిక్ సొసైటీ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లతో పాటు అనుభవజ్ఞులైన ఫొటోగ్రాఫర్లు సైతం తమ ఫొటోలను ప్రదర్శిస్తున్నారు.



ప్రదర్శనలో ఉంచిన ఓ చిత్రం

ఆకట్టుకుంటున్న జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ఈ నెల 9న ముగుస్తుందని నిర్వాహకుడు జయేష్ గుప్తా తెలిపారు.



ప్రదర్శనలోని వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

కేసీఆర్ ఉద్యమాన్ని అవమానిస్తే..
రేవంత్ రెడ్డి ఉద్యమాన్ని అవహేళన చేశారు

- ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

పంజాగుట్ట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నిండు అసెంబ్లీలో కేసీఆర్ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అణగ తొక్కుతా అని అవమానిస్తే, 40 నిమిషాల ప్రసంగంలో రేవంత్ రెడ్డి ఎమ్మార్పీఎస్ పేరు తీయకుండా అవమానించారన్నారని, ఎన్నో ఏళ్లుగా సమాజానికి దూరంగా ఉన్న తనను నరేంద్ర మోదీ గుర్తించి గుండెలకు హత్తుకుని హృదయంలో పెట్టుకున్నారన్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ తన 30 ఏళ్ల పోరాటంలో ప్రతి చోటా తనతో పాటే నడిచిందన్నారు. తన 30 ఏళ్ల పోరాటంలో జాతి కోసం కొన్ని రోజులు కష్టపడితే సమాజంలో జరిగే అనేక కష్టనష్టాలపై పోరాటం చేసిన చరిత్ర ఎమ్మార్పీఎస్ కు ఉందని మందకృష్ణ మాదిగ అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గం నుంచి వచ్చిన తమ ఉద్యమాన్ని గుర్తించి గుండెలకు హత్తుకున్న నరేంద్ర మోదీని, ఉద్యమానికి అడుగడుగున బాసటగా నిలిచిన సమాజానికి తాను రుణపడి ఉంటానని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బి.వెంకటేష్ నేత, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు, బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, వివిధ సంఘాల నాయకులు సాయి కృష్ణ, సుధాకర్ గండే, పిట్ల శ్రీనివాస్ రెడ్డి,పెద్దాపురం నరసింహ, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, దాసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ అధికారి పేరిట రూ. 98 వేలకు టోకరా

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్మీ అధికారినంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు ప్లాట్ కొనుగోలు చేస్తానని నమ్మించి రూ. 98 వేలు కాజేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీకి చెందిన అభిషిక్త్ గడ్డె ప్రైవేటు సంస్థలో మార్కెటింగ్ హెడ్‌గా పనిచేస్తున్నాడు. తన ప్లాట్‌ను అమ్మేందుకు మ్యాజిక్ బ్రిక్స్, 99 ఎకర్స్ వెబ్‌సైట్‌లో పోస్టు పెట్టాడు. ఈ నెల 5న అశోక్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను ఆర్మీ అధికారినని, ప్లాట్ కొనుగోలు చేస్తానని నమ్మబలికాడు. అభిషిక్త్‌కు ఓ బ్యాంకు ఖాతా ఇచ్చి ఒక రూపాయి ట్రాన్స్‌ఫర్ చేస్తే అది ఆర్మీ ట్రెజరీకి వెళ్తుందని చెప్పాడు. అతను చెప్పినట్టు రూపాయి పంపించగా, కొద్ది సేపటికి ఆ రూపాయి అభిషిక్త్ ఖాతాకు తిరిగి వచ్చింది. దీంతో అది ఆర్మీ ఖాతా అని నమ్మాడు. అశోక్ మరోసారి ఫోన్ చేసి 50 వేల ట్రాన్స్‌ఫర్ చేయమని కోరగా, అభిషిక్త్ అలాగే చేశాడు. కొద్ది సేపటికి ఆయన ఖాతా నుంచి మరో రూ. 48 వేలు డ్రా అయ్యాయి. మొత్తం 98 వేల రూపాయలు పోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెరికల్చర్ అధికారిపై కేసు నమోదు

తిరుమలగిరి ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతుల డబ్బులను కాజేసిన సెరికల్చర్ అధికారిపై ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శివకుమార్(50) తిరుమలగిరిలోని పట్టుపరిశ్రమ(సెరికల్చర్) కార్యాలయంలో మార్కెటింగ్ అధికారిగా పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి పట్టు పురుగుల ద్వారా తయారు అయ్యే పట్టును రైతులు తీసుకువచ్చి తిరుమలగిరి కార్యాలయంలో విక్రయిస్తుంటారు. విక్రయించిన పట్టును కర్ణాటకకు చెందిన డీలర్లు కొనుగోలు చేసి సెరికల్చర్ కార్యాలయం అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తారు. ఈ డబ్బులను శివకుమార్ రైతులకు పంచుతుంటారు. అవకతవకలకు పాల్పటిన శివకుమార్‌ను కొన్ని నెలల క్రితం పై అధికారులు సస్పెండ్ చేశారు. ఆడిటింగ్ ఆఫీసర్లు ఆడిట్ చేయగా రూ.21 లక్షలు శివ కుమార్ తన సొంత ఖాతాలో జమ చేసుకున్నారు. మరో 40-50 లక్షలు రైతులకు పంచిపెట్టారు. ఆడిట్ చేసిన అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ మహిపాల్‌కు నివేదికను అందజేయడంతో మహిపాల్ తిరుమలగిరి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కంటోన్మెంట్‌లో సమస్యలు పరిష్కరించాలి


సీఈఓ మధుకర్‌నాయక్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే శ్రీగణేశ్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో సమావేశమై చర్చలు జరిపారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని కాలనీలలో ఉన్న డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, నీటి సరఫరా కోసం పవర్‌బోర్ల అంశంపై చర్చించారు. తిరుమలగిరి లేక్, రామన్నకుంట చెరువు సుందరీకరణ పనులు గురించి చర్చించారు. ఇంకా నిధులు అవసరమైతే అదనపు నిధుల కోసం రాష్ట ప్రభుత్వంతో తాను మాట్లాడుతానని ఎమ్మెల్యే అన్నారు. వీటితో పాటు మడ్‌ఫోర్ట్ ధోబీఘాట్‌లో క్రీడలను ప్రోత్సహించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన టీపీటీ చార్జెస్ రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా నేరుగా బోర్డుకు ఇప్పించాలని బోర్డు తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తే, తాను ప్రభుత్వంతో మాట్లాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిధులు కేటాయించేలా, టీపీటీ చార్జెస్ నిధులు నేరుగా బోర్డుకు వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిత్రంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య తదితరులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

బౌద్ధనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించొచ్చని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి అన్నారు. శుక్రవారం పద్మారావునగర్‌లోని ఎస్‌పీ కాలేజీలో ఏర్పాటు చేసిన 48 సీసీ కెమెరాలను అడిషనల్ డీసీపీ నర్సయ్యతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్‌పీ కాలేజీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కాలనీవాసులు, బస్తీవాసులు ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు ఈ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, కాలేజీ చైర్మన్ హరినాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైలను సన్మానించిన ఏసీపీ


ఏఎస్సై ను సన్మానిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

తిరుమలగిరి ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌తో పాటు మహంకాళి, గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లతో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో పదోన్నతి పొందిన ఏఎస్సైలను నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు శుక్రవారం సన్మానించారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తదితరులు ఉన్నారు.

మర్యాద పూర్వక కలయిక

పద్మారావునగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త టీ.రాజశేఖర్‌రెడ్డిని బస్సీలాల్‌పేట్, అరుణజ్యోతికాలనీలోని ఆయన నివాసంలో సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్న బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఉమేశ్ ఖండేల్‌వాల్‌ను అతడి నివాసంలో కలిసి పరామర్శించారు. హరినాథ్‌నాయి, ఎస్ రాజు, సైసురేశ్, బాలకృష్ణ టెండూల్కర్, డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేశ్‌లు పాల్గొన్నారు.

రేపు దయాల్బాగ్ వస్తు ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) రాధాస్వ అమీ సత్సంగ్ బొల్లారం శాఖ ఆధ్వర్యంలో దయాల్బాగ్ వస్తు ప్రదర్శనను ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొల్లారంలోని తుర్కపల్లి రైల్వేగేట్ సమీపంలోని ఫేజ్ 2, సరన్‌నగర్ కాలనీలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. దయాల్బాగ్, అనుబంధ సంస్థల్లో తయారైన అనేక రకాల వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని నిర్వహకులు తెలిపారు.

బొల్లారంలో ఆటో బోల్తా

తిరుమలగిరి ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని సమీపంలో రాజీవ్ రహదారికి మధ్యలో ఆటో ట్రాలీ శుక్రవారం బోల్తా కొట్టింది. బొల్లారం డౌటన్ బజార్‌లోని మల్లికార్జున టెంట్‌హౌజ్‌కు చెందిన ఆటో ట్రాలీలో డ్రైవర్ తోట ముత్యాలమ్మ దేవాలయం వద్ద మంచినీరు తీసుకురావడానికి బయలుదేరాడు లక్డావాల రాజీవ్ రహదారి నుంచి కుడి వైపు మళ్లించగా ప్రమాదవశాతు డివైడర్ ఎక్కి కింద పడిపోయింది. దీంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించడంతో వివిధ జిల్లాల నుంచి నగరానికి చేరుకున్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పలువురు ప్రయాణికులు వాహనాలను ఆపి ఆటో ట్రాలీకి ఉన్న ఎక్సలేటర్ వైరును తొలగించారు. ట్రాఫిక్ జామ్ అయింది. ప్రయాణికులు కొందరు ఆటోను సరి చేసి పక్కకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

తిరుమలగిరి ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పనిమీద బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యం అయిన సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై అంతోనియమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్ఫాంట్ జీజస్ కాలనీ కి చెందిన బీసుగునమ్మ(87) స్థానికంగా నివాసం ఉంటుంది. సుమారు 3 నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులను, శ్రేయోభిలషులను వాకప్ చేసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



అడ్డగుట్ట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ సమీపంలోని మైసమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ వృద్ధుడి ఆచూకి తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతలో మార్పులను గమనించాలి



చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు

పద్మారావునగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు అనే తేడా లేకుండా అనేక సమస్యలతో రోజూ ఎక్కడోచోట ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యల తీరును పరిశీలిస్తే ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు ఆందోళన కలిగిస్తాయి. కారణాలేమైనా ఇది విచారించదగ్గ విషయం. ముఖ్యంగా మానసిక వత్తిడి, డిప్రెషన్‌కి లోనుకావడం, ఆర్థిక, కుటుంబ కారణాలు, సోషల్ ప్రెషర్ వంటి అనేక కారణాలతో క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతూ విలువైన జీవితాన్ని పోగొట్టుకోవడంతో అనేక కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, చిన్నారులు అనాథలుగా మారుతున్నారు.

నివారణ చర్యలు..

మానసిక వత్తిడికి తట్టుకొనే శక్తిని పెంచుకోవటానికి ఎమోషనల్ రెగ్యులేషన్, ఎమోషనల్ ఇంటలిజెన్స్ ఫ్రెష్టేషన్ టాలరెన్స్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ వంటి స్కిల్స్‌ని పెంచుకోవటం, సామాజిక సంబంధాలను మెరుగుపరచుకోవడం, సమయపాలనతో కూడిన ఆహారపు అలవాట్లు, సరయిన నిద్ర, శారీరక వ్యాయామం, ఆరోగ్యంపై శ్రద్ధ, ఆధ్యాత్మిక చింతన వంటి అనేక అంశాలపై శద్ధ వహించాలి.

ఆత్మహత్యకు కారణాలు..

నేటి యువతలో మానసిక వత్తిడిని తట్టుకొనే శక్తి లేకపోవడం, నిరాశ నిస్పృహకు లోనుకావడం, ఎంచుకున్న లక్ష్యాన్ని అందుకోలేననే భయం,మానసిక సంఘర్షన, ఆర్థిక, సామాజిక కారణాలు, ప్రేమ వ్యవహారాలు, కుటుంబ కలహాలు, మారుతున్న పరిస్థితులకనుగుణంగా తమను సంసిద్ధులుగా కాలేకపోవటం, మెదడుపై న్యూరో ట్రాన్స్‌మీటర్ హార్మోన్స్ ప్రభావం వంటి అనేక అంశాలను ఆత్మహత్యలకు కారణాలుగా పరిగణించాలి. వీటన్నిటితో పాటుగా తల్లిదండ్రులు పిల్లల నడుమ కమ్యూనికేషన్ గ్యాప్, ఇతరుల పిల్లలతో పోల్చడం, చదువుల పేరిట పిల్లలను తమకు దూరంగా హాస్టళ్లలో వంటరిగా ఉంచడం వంటి అనేక కారణాలతో పిల్లలు మానసిక వత్తిడికిలోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనేది మరో కోణం.

గుర్తించడం..

ఆత్మహత్యలకు పాల్పడే వారిని వారి ప్రవర్తనల ద్వారా గుర్తించవచ్చును. ఒంటరితనం, చిరాకు, కోపం, ఎందుకోసం బతకాలి అనే నిరాశ నిస్పృహలతో కూడిన మాటలు ప్రవర్తన. మద్యం వంటి దురఅలవాట్లకు లోను కావడం, చస్తాను అని బెదిరించడం, ఒక్కసారిగా ప్రవర్తనలో మర్పులు. ఇలాంటి లక్షణాలను స్నేహితులలో, విద్యార్థులలో చుట్టు పక్కల వారిలో గమనించినట్లయితే వారితో మాట్లడి నేనున్నాను అంటూ కారణాలను అడిగి తెలుసుకొని నైతిక మద్దతును అందిస్తూ వారికి బతుకుపై ఆశలు చిగురించేలా ధైర్యాన్ని అందించడం, తగిన సహాయం చేయటం, మానసిక వైద్య నిపుణుల సలహా మేరకు పరిస్థితిని బట్టి కౌన్సెలింగ్,మందుల ద్వారా చాలా వరకు ఆత్మహత్యలను నివారించవచ్చును.

వైద్య సహాయాన్ని అందించాలి



మన స్నేహితులు, విద్యార్థులు చుట్టుపక్కలవారు ఆత్మహత్య ఆలోచనలతో ప్రవర్తనలో మర్పులను గుర్తిస్తే, వారు ఎదుర్కొంటున్న సమస్యను ఓపికగా వినాలి. వారికి మేమున్నామనే ధైర్యాన్ని కలిగించాలి. జీవితం పై ఆసక్తిని కలిగించాలి. అవసరమైన పక్షంలో మానసిక వైద్యుల సలహాలు సూచనలు తీసుకొని వారి మానసిక స్థితిని బట్టి కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించాలి. దాంతో సాధ్యమైనంత వరకు ఆత్మహత్యలను నివారించటానికి వీలు కలుగుతుంది.

డాక్టర్ కె.అనుపమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఇన్‌చార్జ్ హెచ్ఓడీ), గాంధీ ఆస్పత్రి

పోల్చడంతో మానసిక ఎదుగుదలపై ప్రభావం



పిల్లలను ఇతరులతో పోల్చడం వలన వారి మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతో మానసిక వత్తిడికి గురయ్యే వారు తన సమస్యను కుటుంబంలో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. యుక్త వయసులో ఉన్న పిల్లలతో స్నేహభావంతో మెలగాలి. అప్పుడే వారి మనసులోని మాటలను తెలియజేస్తారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా తట్టుకొనేలా వారిని సిద్ధం చేయాలి. అన్నిటికీ మేమున్నామనే ధైర్యాన్ని వారిలో కలిగించాలి. ప్రవర్తనలో తేడా కనపడితే కౌన్సెలింగ్, అవసరమైన పక్షంలో మానసిక వైద్యుని సంప్రదించాలి

డాక్టర్ శనిగారపు రాజ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్

భాష మార్చుకో

ఎమ్మెల్యే పద్మారావుపై ఆదం సంతోష్‌కుమార్ ఆగ్రహం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆదం సంతోష్‌కుమార్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్‌లో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుపై సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్టలో గురువారం మారేడుపల్లి రెవెన్యూ అధికారుల సమక్షంలో తుకారాంగేట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చెక్కులు పంచుతామని తామేమీ అడగలేదన్నారు. చెక్కుల పంపిణీ అనంతరం మీడియాతో ఎమ్మెల్యే పద్మారావు మాట్లాడుతూ పార్టీ జోలికొస్తే బొక్కలు విరగొడతానంటూ కాంగ్రెస్ నాయకులను బెదిరించారని, ఎవరి బొక్కలు విరగొడతావో చెప్పాలని సంతోష్‌కుమార్ ప్రశ్నించారు. గతంలో సికింద్రాబాద్ ఎన్నికల్లో పద్మారావును ప్రజలకు పరిచయం చేసింది ఆదం ఫ్యామిలి అని, ఈ విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. 'సికింద్రాబాద్ నీ అడ్డా కాదు, సికింద్రాబాద్‌లో రౌడీయిజం చేస్తున్నావా.. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుందా.. పక్క నియోజకవర్గంలో ఉన్న నీవు ఇక్కడ రాజ్యమేలుతున్నావు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 2021లో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచావని అన్నారు. సికింద్రాబాద్ ప్రజలకు ఆదం కుటుంబం అండగా ఉంటుందన్నారు.

మీడియా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శిల్పాచారి, సందీప్‌రాజ్, జలెందర్‌రెడ్డి, షకీల్‌ఖాన్, వహీద్ ఖాన్, గంటరాజు సాగర్, గణేష్, అనంత కృష్ణ, కిషోర్‌యాదవ్, అమీర్, భూపతిహరి, మంద సురేష్, శివకుమార్ రవిశంకర్‌లు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం పేదల పక్షపాతి


ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి ప్రజల పక్షపాతి అని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం కార్ఖానాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్‌కు మద్దతుగా బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 12 లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరంలేకుండా ఆదాయపన్ను స్లాబ్‌ను పెంచారని, ప్రతిజిల్లాలో క్యాన్సర్ హాస్పటల్ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించటం గొప్ప విషయామన్నారు. బీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశప్రజలందరికి ఉచితంగా రేషన్ అందిస్తూ దేశప్రజల ఆకలి తీరుస్తున్నారన్నారు. కంటోన్మెంట్ సీనియర్ నాయకులు వంశీ తిలక్ మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా రూపొందించటం ప్రధానమంత్రి నరేంద్రమోదీకే సాధ్యమని, అందుకే అన్నివర్గాల ప్రజలు మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ విభాగం నాయకులు భానుక మల్లికార్జున్, పరుశరాం, జేపీ నరసింగ్‌రావు, టోపి శంకర్, శ్రీకాంత, అశోక్, వార్డుల అధ్యక్షులు అరుణ్, ప్రవీణ్, పవన్, ప్రతీక్, రాకేష్, సంతోష్, శ్రవణ్, సచిన్, మహిళా నాయకురాళ్లు విశాలిని, సవిత, విజయలక్ష్మి, వినోద, రేఖ పాల్గొన్నారు.

రైలు కిందపడి బాలిక ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అదృశ్యమైన బాలిక లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ గార్వా ప్రాంతానికి చెందిన సద్దాం అన్సారీ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మానసిక సమస్యలతో బాధపడుతోంది అన్సారీకి ఎక్కడా ఉపాధి దొరక్కపోవడంతో తిరిగి సొంతూరుకు వెళ్లేందుకు గురువారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అర్ధరాత్రి కావడంతో ఊరెళ్లేందుకు రైళ్లు లేకపోవడంతో రెండో నెంబరు గేటు వద్ద ఉన్న వెయింటింగ్ హాలులో పడుకున్నారు. శుక్రవారం తెల్లవారుఝామున కుమార్తె(15) కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు రైల్వేస్టేషన్‌లో అంతా వెతికినప్పటికి బాలిక జాడ దొరకలేదు. దీంతో తల్లిదండ్రులు సికింద్రాబాద్ రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో బాలిక ఆత్మహత్య చేసుకుందనే సమాచారం తెలుసుకున్న రైల్వేపోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్య చేసుకున్నది అన్సారీ కుమార్తెనేనని తేలింది. అనారోగ్యంతోనే బాలిక ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. అనంతరం రైల్వేపోలీసులు మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.


కాంగ్రెస్ నాయకులతో కలిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బౌద్ధనగర్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్‌లో సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ కంది శైలజ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. సుమారు రూ.23 లక్షల నిధులతో ఈ పనులను ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. నాణ్యతాప్రమాణాలతో రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ లావణ్య నాయకులు శ్రీకాంత్, అనిల్‌కుమార్, బెజ్జంకి రాజేష్, చక్రధార్, బబ్లూ, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో నులిపురుగుల అవగాహన కార్యక్రమంలో ఆశా వర్కర్లు

నులిపురుగుల నివారణపై అవగాహన

అడ్డగుట్ట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వీరు ఆశ వర్కర్లకు సూచించారు. శుక్రవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1-9 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్దేశించిన మోతాదు మేరకు ట్యాబెట్లు వేయాలని ఆశ వర్కర్లకు సూచించారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నివారణ టాబ్లెట్లు అందుబాటులో ఉంటాయన్నారు.


విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఎన్ఆర్ఐ దంపతులు ఫణికృష్ణ, దివ్య. అల్పాహారం తింటున్న విద్యార్థులు

ప్రభుత్వ విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం

ఎన్ఆర్ఐ దంపతుల దయాగుణం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలోని మూడొందల మంది విద్యార్థులకు ఎన్ఆర్ఐ దంపతులు పామర్తి ఫణికృష్ణ, దివ్యలు ఏడాదంతా ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం విద్యార్థులకు వేడివేడి అల్పాహారంగా పొంగల్, ఆవు పాలు, రోజుకో రకం అల్పాహారం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం రెండు రోజుల క్రితం ప్రారంభమైందని పాఠశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

'ఈఎస్ఐని సొసైటీగా మార్చొద్దు'

పద్మారావునగర్: బీమా వైద్య సేవల శాఖను మూసివేసి, కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఈఎస్ఐ సొసైటీగా మార్చటానికి చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని, తాము మార్పునకు పూర్తి వ్యతిరేకమని ఈఎస్ఐ ఉద్యోగ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బీమా వైద్య సేవల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఫ్యామిలీ వెల్ఫేర్) డాక్టర్ నీరజకు ఉద్యోగుల సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశామని టీఎన్‌జీఓ ఐఎంఎస్ డైరెక్టరేట్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కెవీరన్నగౌడ్ శుక్రవారం తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లతో పది రోజులుగా భోజన విరామ సమయంలో నిరసన కొనసాగిస్తున్నామని తెలిపారు.

సమస్య పరిష్కారానికి అండగా ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఎమ్మెల్యేను కలిసిన కోర్టు టైపిస్టులు

మారేడుపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'మీ ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాను అండగా ఉంటా'నని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి హామీ ఇచ్చారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయం వద్ద సికింద్రాబాద్ కోర్టు వద్ద ఫుట్‌పాత్‌పై నోటరీ, టైపిస్ట్, స్టాంప్ వెండర్‌లుగా వ్యాపారం సాగిస్తున్న వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎన్నో సంవత్సరాల నుంచి కోర్టు పరిసరాలలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కానీ మూడు రోజుల్లో ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని ట్రాఫిక్ పోలీసు, అధికారులు నోటీసులు ఇచ్చారని, ఇప్పుడు ఖాళీ చేయాలంటే తాము ఉపాధిని కోల్పోతామని, తమ కుటుంబాలు వీధిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. 'మీ ఉపాధికి ఎలాంటి ఆటంకం కలుగకుండా చూస్తానని, మీకు అండగా ఉంటా'నని వారికి భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన కోర్టు టైపిస్టులు

అడ్డగుట్ట: కోర్టుల నుంచి ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న వారిని ట్రాఫిక్ పోలీసులు ఖాళీ చేయమంటున్నారని సికింద్రాబాద్ కోర్టు ఆవరణలో ఉన్న టైపిస్టులు, వీధి వ్యాపారస్థులు శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కోర్టుల నుంచి సికింద్రాబాద్ కోర్టు బయట ఫుట్‌పాత్‌లపై టైపిస్టులు, స్టాంప్ వెండర్లు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారని, కొద్ది రోజుల క్రితం ట్రాఫిక్ పోలీసులు తమని ఖాళీ చేయాలని చెబుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీధి వ్యాపారస్తులకు న్యాయం జరిగేలా సీఎం దృష్టికి తీసుకొస్తానని వ్యాపారస్తులు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.